
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 8 డిసెంబరు 2025



అద్దె భవనాలే దిక్కు

- సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు
- అరకొర వసతులు
- ఉద్యోగులకు తప్పని తిప్పలు
- జిల్లా అయినా తొలగని సమస్యలు

వైసీపీ పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి కొత్తగా నంద్యాల జిల్లా ఏర్పాటు చేసి అప్పటి పాలకులు, అధికార యంత్రాంగం చేతులు దులుపుకుంది. ప్రభుత్వ పాలన సాగాలంటే కార్యాలయాలు తప్పనిసరి. దీంతో ఎక్కువ శాతం ప్రభుత్వ శాఖల కార్యాలయాలను అద్దె భవనాల్లోనూ.. గ్రామ, వార్డు సచివాలయాల్లో.. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలో తాత్కాలిక భవనాలు ఏర్పాటుచేసుకొని విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి. ఏదిఏమైనా శాశ్వత భవనాలు లేక.. ఆయా శాఖలు అవస్థలు పడుతుండగా మరోవైపు అద్దెల రూపంలో ప్రభుత్వ సొమ్ముతో కొందరు అధికారులు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



నంద్యాలలోని ప్రైవేట్ బిల్డింగ్‌లో వివిధ శాఖలకు కేటాయించిన భవనం

నంద్యాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పాటై సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ చాలా శాఖలకు చెందిన కార్యాలయాలకు అద్దె భవనాలే దిక్కుగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాలకు ఆశించిన స్థాయిలో భవనాలు.. కనీస వసతులు కల్పించకుండానే జిల్లాను ఏర్పాటుచేసి మమ అనిపించారు. ఎక్కడా ఆశించిన స్థాయిలో ప్రభుత్వశాఖలకు భవనాలు.. కనీస వసతులు సైతం గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదనే ప్రభుత్వ ఉద్యోగులు వాపోతున్నారు. పలు ప్రధానశాఖలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాలు కూడా అద్దె భవనాల్లోను.. ఇతర శాఖలకు చెందిన అరకొర వసతులు ఉన్న భవనాల్లోను ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది.



యథావిధిగా సాగుతున్నాయి

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావచ్చినా కూడా ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనాల్లోనే యథావిధిగా కొనసాగుతున్నాయి. జిల్లా కలెక్టర్, వ్యవసాయ, పర్యాటక శాఖ కార్యాలయాలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని ఆవరణలో తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. జిల్లా ఉద్యానశాఖ, బీసీ, ఎస్సీ, ఎస్టీ శాఖల వెల్ఫేర్ కార్యాలయాలు, సర్వే, భూరికార్డుల కార్యాలయం, మత్స్యశాఖ, అటవీశాఖ సీఎఫ్‌వో కార్యాలయం, ఔషధ నియంత్రణ, తూనికలు కొలతల శాఖ, ఆహార భద్రతశాఖ, పౌరుసర పరాల శాఖ, జిల్లా విద్యాశాఖ, దేవదాయశాఖ తదితర శాఖలు అద్దె భవనాల్లో నేటికి కొనసాగుతున్నాయి. గ్రామ వార్డు సచివాలయాల భవనాల్లో ఎస్ఎస్ఏ, జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), డీఎల్‌పీవో కార్యాలయాలు సైతం నడుస్తున్నాయి. జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం సైతం తాత్కాలిక రేకులషెడ్డుతో ఏర్పాటు చేసుకుని ఉద్యోగులు విధులు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. జిల్లా వైద్యఆరోగ్యశాఖ, డీసీహెచ్ఎస్ కార్యాలయాలు సైతం నంద్యాల ప్రభుత్వాస్పత్రిలోని రెండు విభాగాలకు చెందిన గదుల్లో ఏర్పాటు చేసుకుని అధికార యంత్రాంగం పాలన సాగిస్తున్నారు. ఉద్యోగులు, ప్రజలు సైతం అరకొరత వసతులతో ఇబ్బందులు పడుతున్నారు.



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కలెక్టర్ కార్యాలయం

అధికారులు చేతివాటం ప్రదర్శించి..

పలు ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తుండటంతో అద్దెలు చెల్లింపులో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించి క్యాష్ చేసుకుంటున్నారని సమాచారం. కూటమి ప్రభుత్వమైనా ప్రభుత్వ శాఖలకు శాశ్విత భవనాలు ఏర్పాటు చేయాలి.. లేదంటే.. ఉన్న వాటికి కనీస వసతులు సైతం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న అటవీశాఖ చీఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ కార్యాలయం



నంద్యాల ప్రభుత్వాస్పత్రి ఆవరణలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ఇలా..



నంద్యాల: గ్రామ వార్డు సచివాలయం భవనంలో ఎస్ఎస్ఏ కార్యాలయం

శాంతిభద్రతల కోసమే కార్డన్ సెర్చ్

- ఎస్పీ సునీల్ షెరాన్ ● 21 వాహనాలు సీజ్



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

నంద్యాల టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల కోసం, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సునీల్ షెరాన్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల, ఆత్మకూరు సబ్ డివిజన్‌ల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అనుమానాస్పద, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించామన్నారు. అలాంటి వారికి అక్కడే కౌన్సెలింగ్ ఇచ్చామని అన్నారు. సరైన పత్రాలు లేని 21 వాహనాలను సీజ్ చేశామని, 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలతో సమావేశం నిర్వహించి సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, చిన్నారులపై జరిగే నేరాలు, బాల్యవివాహాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణలో మార్పులు చేయాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు

నంద్యాల ఎడ్యుకేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వంద రోజుల కార్యాచరణలో మార్పులు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ పదవ తరగతి వందరోజుల ప్రణాళికలో రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులను మినహాయించాలని కోరారు. కార్యాచరణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు వెంటనే సీసీఎల్ మంజూరు చేయాలని, డీఎస్సీ 2025 ఉపాధ్యాయులకు లీప్ యాప్ ద్వారా సెలవు పెట్టుకోవడంలో ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. పరీక్షలను వెనువెంటనే నిర్వహించడంతో అసెస్మెంట్ బుక్‌లెట్‌ను కరెక్షన్ చేయడంలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు వీరేశ్వరరెడ్డి, జాకీర్ హుస్సేన్, జిల్లా సబ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నారాయణ, మధు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలెక్టరేట్‌తో పాటు పట్టణ, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చునన్నారు. అర్జీ పరిష్కార స్థితి తెలుసుకోవడానికి వెబ్‌సైట్ లోనూ, టోల్ ఫ్రీ నెంబరు 1100 ద్వారా తెలుసుకోవచ్చునని వివరించారు. జిల్లా కేంద్రంలో జరిగే ఈకార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించండి

- ఎన్ఎస్‌టీఆర్ ప్రాజెక్టు డీడీ విఘ్నేష్ అప్పావ్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్

ఆత్మకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ టీఆర్ (నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్) ప్రాజెక్టు పరిధిలో వన్య ప్రాణుల సంరక్షణకు విద్యుత్ శాఖ అధికారులు సహకరించాలని ఆ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్(డీడీ) విఘ్నేష్ అప్పావ్ అన్నారు. ఆదివారం మండలంలోని బైర్లూటి ఎకో టూరిజం కేంద్రంలోని సమావేశ భవనంలో అటవీ శాఖ, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సమీప గ్రామాలు, సరిహద్దు ప్రాంతాల్లో, అరణ్యంలో అనధికార విద్యుత్ కనెక్షన్‌లపై కఠిన చర్యలు తీసుకుని వణ్యప్రాణి సంరక్షణకు సహకరించాలని అన్నారు. అనధికారిక విద్యుత్ స్తంభాలు తొలగించాలని కోరారు. సమన్వయంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఈవిషయంపై అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించాలని సూచించారు. ఇటీవల అక్రమ వేటకోసం అడవిలో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల కారణంగా ప్రాణాలు కోల్పోయిన ప్రొటెక్షన్ వాచర్ లక్ష్మానాయక్ కుటుంబానికి చెల్లించవలసిన పరిహారాన్ని విద్యుత్ శాఖ త్వరగా చెల్లించాలని కోరారు. హైదరాబాదుకు చెందిన హైటికోస్ సంస్థ కోఆర్డినేటర్ ఇమ్రాన్ సిద్ధిక్ మాట్లాడుతూ అటవీ సమీప గ్రామాల ప్రజలు సాగు పొలాల వద్ద, అటవీ ప్రాతంలో వేటగాళ్ల అనధికార విద్యుత్ లైన్లను ఉపయోగించి వణ్యప్రాణులను హతమారుస్తున్నారన్నారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లతో అడవి జంతువులకు ముప్పుగా మారిందని అన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజర్లు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రమణీయం.. స్వర్ణ రథోత్సవం

- స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ఆలయ ప్రధాన మాడ వీధిలో స్వర్ణ రథోత్సవం



నందిమండపం వద్ద దర్శనం కోసం వేచిఉన్న భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఆది దంపతుల స్వర్ణరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వార్చనలు చేసిన తరువాత భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామిఅమ్మవార్లకు ఆరుద్ర నక్షత్ర పూజలు చేశారు. గంగాధర మండపం రథశాల వద్ద స్వర్ణరథంపై ఆశీనులై ఉన్న స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహించారు. గంగాధర మండపం నుంచి మొదలుకొని నంది మండపం వరకు తిరిగి నంది మండపం నుంచి గంగాధర మండపం వరకు స్వర్ణ రథోత్సవం కొనసాగింది. ఈవో శ్రీనివాసరావుతో పాటు పాలకమండలి సభ్యులు ఏవీ రమణ, గంగమ్మ, వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి, అధికారులు పూజల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కోలాటాలు, సంప్రదాయ నృత్యాలు చేశారు. సాయంత్రం ఆలయంలో పుష్పాలంకరణ చేసిన పల్లకిపై ఆదిదంపతులను ఆశీనులచేసి వార పూజల అనంతరం ఆలయ ప్రదక్షిణగా పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు.

శివనామస్మరణతో..

శ్రీశైల క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. మండల దీక్షలు విరమించుకునే శివస్వాములు.. శబరిమల యాత్రలో భాగంగా మల్లన్న దర్శనానికి వస్తున్న అయ్యప్ప స్వాములే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వస్తున్న యాత్రికులతో క్షేత్రమంతా ఆధ్యాత్మిక సందడితో నిండిపోయింది. స్పర్శ దర్శనాలు తాత్కాలికంగా నిలిపి వేసి అందరికీ అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నందున భక్తులు ఆలయ సిబ్బందితో సహకరించవలసిందిగా ఈవో కోరారు. అతిశీఘ్ర దర్శనం టికెట్ భక్తులు ఉచిత లడ్డూ ప్రసాదాలను పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత శిక్షణ కోసం స్క్రీనింగ్ టెస్టు

- డీబీసీడబ్ల్యూవో ప్రసూన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీబీసీడబ్ల్యూవో ప్రసూన

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ పొందే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్‌లో ఆదివారం స్క్రీనింగ్ టెస్టు నిర్వహించినట్లు డీబీసీడబ్ల్యూవో ప్రసూన తెలిపారు. ఈపరీక్షకు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి మొత్తం 69మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 48మంది కర్నూలుకు చెందిన వారు కాగా, 21మంది నంద్యాలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. ఈ పరీక్షకు 57 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. ప్రశాంతంగా పరీక్ష జరిగినట్లు ఆమె తెలిపారు.

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

కల్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చేపట్టే కార్యక్రమాన్ని డిస్కం పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 8977716661 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

మూడు నెలలుగా ఎదురుచూపులు

- కూలి రాకపోవడంతో ఉపాధి కూలీల అవస్థలు
- గ్రామాల్లో నిలిచిపోయిన పనులు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో ముమ్మరంగా పనులు జరగాల్సి ఉంది. అయితే.. మూడు నెలలుగా ఆగస్టు నుంచి ఇప్పటి వరకు గ్రామాల్లో పనులు చేసిన రైతులు, రైతు కూలీలకు కూలి ఇవ్వకపోవడంతో వారందరూ పస్తులతో అలమటిస్తున్నారు. మరో దారి లేక కుటుంబ సభ్యులతో బతుకు జీవుడా అంటూ దూర ప్రాంతాలకు వలసెళ్లిపోయి నానా కష్టాలు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వేతనాల ఖర్చు రూ.278 కోట్లు

కర్నూలు జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.58లక్షల పనిదినాలు రైతులకు, రైతు కూలీలకు కల్పించాల్సి ఉండగా.. ఇప్పటి దాకా 50.51 లక్షల పనిదినాలను కల్పించారు. ఈ పనిదినాలకు సంబంధించి రూ.136.46 కోట్లు ఖర్చు చేశారు. జూలై వరకు సక్రమంగా పని చేసిన వారికి కూలి డబ్బులు చెల్లించారు. ప్రస్తుతం ఆగస్టు నుంచి నవంబరు నెలాఖరు వరకు కర్నూలు జిల్లాలో రూ.2 కోట్ల దాకా కూలీలకు వేతనాల రూపంలో చెల్లించాల్సి ఉందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 58 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా.. ఇప్పటికి 50.73 లక్షల దినాలను కల్పించినట్లు అధికారులు తెలిపారు. పని చేసినందుకు గానూ రూ.132.82 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కూలీలకు ఇంకా రెండున్నర కోట్లు చెల్లించాల్సి ఉంది. ఏకంగా మూడు నెలల పాటు కూలి అందకపోవడంతో గ్రామాల్లోని కూలీలు ఇతర పనుల కోసం వెతుకులాట మొదలెట్టారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం రబీ సీజన్‌లో వ్యవసాయ పనులు నామమాత్రంగానే జరుగుతుండటంతో కొత్త జీవనోపాధి కోసం పొట్ట చేతపట్టుకుని కూలీలు, రైతులు బతుకుజీవుడా అంటూ గుంటూరు, బెంగళూరు, హైదరాబాదు తదితర దూర ప్రాంతాలకు మిరప తదితర పంటల పనుల కోసం వెళ్తున్నారు. కుటుంబం మొత్తం వలస వెళ్తుండడంతో గ్రామాల్లోని వీధులు నిర్మానుష్యంగా మారిపోయాయి. పత్తికొండ, పాణ్యం, మంత్రాలయం, ఆలూరు, డోన్ తదితర ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా వలస వెళ్తున్నారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి బకాయి నిధులను విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న నీటి కుంటలు, పండ్ల తోటల పెంపకం, ఇంకుడు గుంతలు, వాటర్‌షెడ్ ద్వారా చేపట్టిన తదితర పనులన్నీ నిలిచిపోయాయి. పెండింగ్ బకాయిలు ఇస్తేనే పనులు చేస్తామని కాంట్రాక్టర్లు భీష్మించుకున్నారు. ఇప్పటిదాకా ఉపాధి పనుల కోసం నంద్యాల జిల్లాలో సామగ్రి ఖర్చు కింద రూ.64.67 కోట్లు వెచ్చించారు. కర్నూలు జిల్లాలో రూ.72.10 కోట్లు ఖర్చు చేశారు.

త్వరలోనే వేతనాలు చెల్లిస్తాం

కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు ఆగస్టు నుంచి వేతనాలు ఇవ్వలేదు. అదే విధంగా చేసిన పనులకు సంబంధించి రూ.20 కోట్ల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. వారం పది రోజుల్లో వేతనాలతో పాటు చేసిన పనులకు సంబంధించి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

- వెంకటరమణయ్య, డ్వామా పీడీ

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

- రామానుజ జీయర్ స్వామిజీ, ఆదిత్య పరాశ్రీస్వామీజీ
- కోడుమూరులో భారీ ర్యాలీ
- తరలివచ్చిన హిందువులు



మాట్లాడుతున్నరామానుజ జీయర్ స్వామీజీ, ఆదిత్య పరాశ్రీస్వామీజీ

కోడుమూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం విశిష్టతను కాపాడడానికి హిందువులంతా కృషి చేయాలని రామానుజ జీయర్ స్వామీజీ, ఆదిత్య పరాశ్రీస్వామీజీ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన హిందూ సమ్మేళనకు సభకు వారు హాజరై సందేశం వినిపించారు. సనాతన హిందూ ధర్మానికి అనంత శక్తి ఉందన్నారు. ఈ సందర్భంగా రామానుజ జీయర్ స్వామీజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భారతీయతత్వంలో మెలగాలని సూచించారు. పరమాత్ముడు అందించిన భగవద్గీత తప్పకుండా చదవాలన్నారు. ప్రతి రోజూ ఆలయ సందర్శనతో భక్తి, వినయం, విధేయత పెరుగుతుం దని, జ్ఞానం వికసిస్తుందన్నారు. ఆదిత్య పరాశ్రీస్వామీజీ మాట్లాడు తూ హిందువులు ఏమతానికి వ్యతిరేకం కాదన్నారు. ఎవరి మతం వారు ఆచరించుకోవచ్చన్నారు. అదే సమయంలో ఇతర మత విశ్వాసాలపై వ్యతిరేక భావనలు చేయవద్దన్నారు. ప్రస్తుత సమాజంలో హిందువులు ఐక్యతగా మెలగాలని, కులాల పేరుతో కుంపట్లు పెట్టుకోవద్దన్నారు. లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం అత్యద్భుతమని స్వామీజీలు కితాబునిచ్చారు. ఆలయ నిర్మాణ శైలిని చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి వివరించారు. ఆలయ నిర్మాణానికి ప్రతి హిందువు తోడ్పాడు అందించాలని సూచించారు. ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరవుతామని చైర్మన్‌కు వారు హామీ ఇచ్చారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, కేవీఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ, బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, కిరణ్, ఎద్దుల సూర్యారెడ్డి, వేణుగోపాల్, ఎద్దుల సత్యారెడ్డి, దామోదర్, వెంకటస్వామి, గంగాధర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహాపాదయాత్రతో పరవశించిన జనం

హిందూ సమ్మేళన సభను పురస్కరించుకుని మహా పాదయాత్ర చేపట్టారు. హిందూ సమ్మేళన సమితి, ఆలయాల కమిటీ, లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భారీగా జనం తరలివచ్చారు. విశిష్టఅతిథులుగా హాజరైన స్వామిజీలకు చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామాలయంలో పూజలు నిర్వహించిన స్వామిజీలు, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డితో కలిసి మహా పాదయాత్రలో పాల్గొన్నారు.

జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగింది

రామాలయం నుంచి లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం వరకు కోలాటాలు, డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య పాదయాత్ర జైశ్రీరామ్ నినాదాలతో సాగింది. ఆలయ చైర్మన్ మహేశ్వరరెడ్డి ఉత్సాహంగా డప్పు కొట్టారు. యువత కాషాయ జెండాలను పట్టి నృత్యాలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.



పాల్గొన్న భక్తులు

శ్మశానం కోసం ఎకరా భూమి విరాళం

- ఎన్నికల హామీలో భాగంగా అందజేసిన ఎంపీటీసీ



భూమి పత్రాలు అందజేస్తున్న ప్రహ్లాదరెడ్డి

హాలహర్వి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారపల్లి గ్రామానికి చెందిన మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, ఎంపీటీసీ ప్రహ్లాదరెడ్డి ఊరి శ్మశానం కోసం ఒక ఎకరా పొలాన్ని ఉచితంగా దానం ఇచ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం భూమి పత్రాలను గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గత ఎంపీటీసీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గ్రామస్థులకు అందజేసినట్లు తెలిపారు. 11వ సర్వే నంబర్‌లో గ్రామస్థులు అన్ని మతాల వారు శ్మశానంగా వాడుకోవచ్చన్నారు. పచ్చారపల్లి, బాపురం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పరుగు పందెంలో విద్యార్థికి స్వర్ణ పతకం



జాతీయ స్థాయి పరుగుపందెంలో గోల్డు మెడల్ సాధించిన వెంకటరామిరెడ్డి

ఎమ్మిగనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల జైపూర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో నందవరం మండలం హాలహర్వికి చెందిన విద్యార్థి వెంకటరామిరెడ్డి 800 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించాడు. అతడు ప్రస్తుతం డిగ్రీ (బీబీఎం) గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో చదువుతున్నాడు. ఆదివారం ఎమ్మిగనూరుకు వచ్చిన విద్యార్థి వెంకటరామి రెడ్డిని కోచ్ మల్లికార్జున, క్రీడాకారులు అభినందించారు. ఈ సందర్భంగా వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ కోచ్ ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయిలో రాణించానన్నారు. రాబోయే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని దేశానికి పేరు తీసురావాలన్నదే తన కోరిక అన్నారు.

భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

కొలిమిగుండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త, అతడి బంధువులు దాడిచేసినట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. మండలంలోని ఉమ్మాయిపల్లెకి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి, సుధారాణి భార్యాభర్తలు. వీరి మధ్య వివాదాలు నెలకొన్న నేపథ్యంలో సుధారాణి కొంతకాలంగా పుట్టినిల్లు అయిన ఆళ్లగడ్డలో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో గతనెల 28వ తేదీన భర్త వద్ద ఉన్న చిన్నకుమారుడిని తీసుకెళ్లడానికి వచ్చింది. ఈ క్రమంలో భర్త, మరికొంత మంది బంధువులు ఆమెపై దాడి చేశారు. ఈక్రమంలో ఆదివారం బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఓంకార క్షేత్రంలో న్యాయాధికారి పూజలు



ఓంకారంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి

బండిఆత్మకూరు డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఓంకారంలో వెలసిన గంగా ఉమా సమేత సిద్ధేశ్వర స్వామిని నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్ తంగమణి దర్శించుకున్నారు. ఆదివారం క్షేత్రానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ కమిటీ చైర్మన్ చెన్నారెడ్డి, అర్చకులు చక్రపాణిశర్మ, మృగపణిశర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు, పూజలు చేశారు. ఆలయ మంటపంలో ఆమెను సత్కరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

- ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర చరిత్ర కలిగిన వారు నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా ఉండాలని ఎస్పీ సునీల్ షెరాన్ సూచించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న పనులు, జీవన విధానం అడిగి తెలుసుకున్నారు. నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. పోలీసులు చెప్పినట్లు మంచి మార్గంలో నడవాలని లేని పక్షంలో ఎక్కడైనా నేరాల్లో పాల్గొన్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

రైలు కింద పడి కర్ణాటక వాసి ఆత్మహత్య

కోసిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కోసిగి రైల్వేస్టేషన్ సమీపంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఆరోలి గ్రామానికి చెందిన తిమ్మప్ప (45) అనే వ్యక్తి కోసిగి రైల్వేస్టేషన్ సమీపంలో 16577 అనే బెంగళూరు - బీదర్ వెళ్తున్న స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మంత్రాలయం ఆర్‌పీఎఫ్ ఎస్ఐ పి.నరసింహమూర్తి, హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య తెలిపిన వివరాల మేరకు గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మా కడుపు కొట్టొద్దు

- పరిహారం అందకపోతే ఆత్మహత్యలే శరణ్యం
- ఉప్పలపాడు రైతులు



పట్టాలు చూపుతున్న బాధిత రైతులు

ఓర్వకల్లు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూములు కోల్పోయిన తమ కడుపు కొట్టొద్దు అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి రైతులు మొర పెట్టుకున్నారు. ఆదివారం ఓర్వకల్లులో ఉప్పలపాడుకు చెందిన 23మంది దళిత రైతులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన 23 మంది రైతులు డీఆర్‌డీవోలో భూములు కోల్పోయారన్నారు. ఆ రైతులకు నష్టపరిహారం అందకుండా కాటసాని రాంభూపాల్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పాలకొలను పొలిమేరలో ఏళ్ల తరబడి భూములు సాగు చేసుకుంటున్నామన్నారు. ఆ భూములు సాగులో ఉన్నప్పటికీ నష్టపరిహారం ఇవ్వకపోవడంతో 2018లో పాలకొలనుకి చెందిన సుధాకర్‌రెడ్డి హైకోర్టులో కేసు వేశారన్నారు. ఈ మేరకు హైకోర్టు ఆర్డీవో, తహసీల్దార్, కలెక్టర్‌కు నష్టపరిహారం ఇవ్వాలని ఆర్డర్ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం 23మంది అర్హులని, వారికి రూ.5.24కోట్లు డబ్బులు మంజూరు చేశారన్నారు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి 23 మంది రైతులు అనర్హులని కలెక్టర్‌కు స్వయంగా ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. పేదలకు సాయం చేయాల్సిందిపోయి పరిహారం రాకుండా అడ్డుపడటం తగదన్నారు. తమకు నష్టపరిహారం అందకపోతే పురుగుమందు ఆత్మహత్య చేసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య, ఏసేపు, బోడన్న, రామదాసు, సుంకులమ్మ, ప్రభాకర్, ఫక్కీరయ్య, అనంతమ్మ, శేషమ్మ, మద్దమ్మ, గుండమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

ఏఎంసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా హరిబాబు



హరిబాబును అభినందిస్తున్న వివిధ మార్కెట్‌యార్డుల చైర్మన్లు

నంద్యాల ఎడ్యుకేషన్/ నంద్యాల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల (ఏఎంసీ) సంఘం అధ్యక్షుడిగా నంద్యాల మార్కెట్‌యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మంగళగిరిలో ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో 26 జిల్లాలకు చెందిన ఏఎంసీ చైర్మన్లు గుంటుపల్లి హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హరిబాబు మాట్లాడుతూ రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌యార్డు చైర్మన్లకు చెక్‌పవర్ ఇవ్వాలని, మార్కెట్‌యార్డుల నుంచి గ్రామీణ లింక్ రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు కొత్త గోదాములను నిర్మించేవిధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాన్, మంత్రులు నారాలోకేశ్, అచ్చెన్నాయుడు, ఎన్ఎండీ ఫరూక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

గౌరు కుటుంబాన్ని విమర్శిస్తే ఖబడ్దార్

- టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు సీఎన్ సుధాకర్ రెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన తనయుడు శివనరసింహారెడ్డి తరుచూ ప్రెస్‌మీట్లు పెట్టి గౌరు కుటుంబంపై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని, ఖబడ్దార్ అంటూ టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఓర్వకల్లులోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. హుశేనాపురం సొసైటీ అధ్యక్షుడు చదువుల సుధాకర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్లమోహన్‌రెడ్డితో పాటు మరికొంత మంది నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే గౌరు చరిత చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కాటసాని, ఆయన తనయుడు అవాకులు, చివాకులు పేలుస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో భూకబ్జాలు, అక్రమ కేసులు, మట్టి మాఫియా చేసిన ఘనత మీదే అన్నారు. బహిరంగ చర్చకు సిద్ధమా అని, ఎక్కడికి రమ్మంటే అక్కడికి రావడానికి సిద్ధం అని సవాల్ విసిరారు. యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి చదువుకుంటూ కార్యకర్తలకు సూచనలు చేస్తూ ఆదుకుంటున్నారని, కాటసాని శివనరసింహారెడ్డి గన్‌తో బెదిరించే ప్రయత్నాలు చేస్తే సహించే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు నాగేశ్వరరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, జీకే సుధాకర్, లక్ష్మీకాంతరెడ్డి, పుల్లారెడ్డి, చంద్ర పెద్దస్వామి, సూర రాజన్న, టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పడిపోయిన కొత్తిమీర ధర

- మడి రూ. 50



గోనెగండ్లలో సాగు చేసిన కొత్తి మీర పంట

గోనెగండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తిమీర ధర ఒక్కసారిగా పడిపోయింది. కొత్తిమీరను సాగుచేసిన రైతులు విలవిలలాడుతున్నారు. పది రోజుల్లో కొత్తి మీర మడి ధర రూ.800 నుంచి రూ.50కు పడిపోయింది. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర అమాంతంగా పడిపోవడంతో రైతులు, వ్యాపారులు సైతం ఉలిక్కి పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మిగనూరు డివిజన్‌లో చాలా మంది రైతులు తక్కువ కాలంలో పంట చేతికి అందుతుందనే కారణంగా కొత్తిమీరను సాగుచేశారు. దాదాపు 3000 ఎకరాలలో సాగు చేసినట్లు తెలుస్తుంది. ఎకరానికి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఒక ఎకరంలో 200 నుంచి 220 మడులు వేస్తారు. కేవలం మడి ధర రూ.50 పలుకుతుండటంతో కొంత మంది రైతులు ఈపంట వైపు కూడా చూడటం లేదు. గోనెగండ్ల మండలంలో ప్రస్తుతం బావులు, బోర్ల దగ్గర దాదాపు 1000 ఎకరాల్లో కొత్తిమీర పంటను సాగు చేశారు. పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదని రైతులు చెబుతున్నారు.

పొలాల్లోనే వదిలేశాను



ఎకరం పొలంలో కొత్తి మీర పంటను సాగు చేశా. పెట్టుబడి రూ. 30వేల వరకు ఖర్చు చేశా. పంట చేతికి వచ్చిందనుకుంటే ధర అమాంతంగా పడిపోయింది. పంటను కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. వారం క్రితం కొత్తిమీరను కొంటానన్న వ్యాపారి నేడు కనిపించడం లేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి.

- కబుల్, రైతు, గోనెగండ్ల

గుప్త నిధుల కోసం వేట



స్కానర్లు ఆధునిక పరికరాలతో తనిఖీలు చేస్తున్న కర్ణాటక వాసులు

కోసిగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగసనూరు సమీపంలోని తిప్పన్నతాత మఠం వద్ద మల్లికార్జునస్వామి దేవాలయం ముందు గుప్త నిధుల కోసం వేట కొనసాగింది. ఆదివారం కర్ణాటకకు చెందిన నలుగురు వ్యక్తులు మెటల్ డిటెక్టర్లు, స్కానర్లతో గుప్తనిధులు పరిశీలిస్తుండగా గ్రామానికి చెందిన నగేష్ అనే వ్యక్తి వారిని చూసి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. గ్రామస్థులకు సమాచారం అందించాడు. దీంతో వేటగాళ్లు తమ తెచ్చిన స్కానర్లు, మెటల్ డిటెక్టర్లను తీసుకొని కారులో పరారయ్యారు. గతంలో కర్ణాటక వాసులు తుంగభద్ర నది సమీపంలో పురాతన ఆలయాల్లో గుప్త నిధుల కోసం తనిఖీలు చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. వేటగాళ్లు కర్ణాటకలోని రాజోలి, జూకురు చెందినవారై ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక వాసులు గుప్త నిధుల కోసం గ్రామానికి రావడంతో అగసనూరు వాసులు ఆగ్రహించారు. ఇదే విషయాన్ని ఎస్ఐ రమేష్‌రెడ్డిని వివరణ కోరగా.. విచారణ చేస్తామని, వారిపై చర్యలు తీసుకుంటామని, గుప్త నిధుల కోసం పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కుమ్మరులు రాజకీయాల్లో రాణించాలి



మాట్లాడుతున్న రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ పుల్లయ్య

కర్నూలు ఎడ్యుకేషన్/కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుమ్మరులు తమ పిల్లలను విద్యావంతులను చేసి ఆర్థికంగానూ, సామాజికంగానూ, రాజకీయంగానూ రాణించాలని రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ వ్యవస్థాపకుడు గూడూరు పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక నంద్యాల రోడ్డులోని సిరీ మెగా ఫంక్షన్ హాలులో కుమ్మరుల శాలివాహన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలకతీతంగా తమ సత్తా చాటాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కేసీ నాగన్న, జిల్లా కార్యదర్శిగా రమేష్, జిల్లా కోశాధికారిగా వెంకటేశ్వర్లు, నగర సలహాదారులుగా వెంకటేశ్వర్లు, నగర గౌరవ సలహాదారులుగా లింగన్న, నగర అధ్యక్షుడిగా మధు, కార్యదర్శిగా గుమ్మకొండ రమేష్, కోశాధికారి చిట్టిబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పీటీవీ సుబ్బయ్య, సుధాకర్, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నరసింగ్‌బాబు, అసోసియేట్ అధ్యక్షులుగా పాండురంగస్వామి, గూడెంపాడు శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు సోమేష్, బజారప్ప, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని డిమాండ్ కుమ్మరులు, శాలివాహన సంఘం నాయకులు కోరారు. శాలివాహన కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

16నుంచి తిరుప్పావై ప్రవచనాల కార్యక్రమాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న నంది రైతు సమాఖ్య ప్రతినిధులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో ఈనెల 16నుంచి జనవరి 14వరకు తిరుప్పావై దివ్య ప్రవచనా కార్యక్రమాలు పట్టణంలోని సంజీవనగర్ కోదండరామాలయంలో నిర్వహిస్తున్నట్లు నంది రైతు సమాఖ్య గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం భారతీ సీడ్స్ కార్యాలయంలో తిరుప్పావై ప్రవచనాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వ్యాఖ్యాతగా మధువాగ్వసంత, వాక్సుధానిధి వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో తిరుప్పావై ప్రవచనాల వ్యాఖ్యాత, టీటీడీ బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత డాక్టర్ దివిహయగ్రీవాచార్యులు, డాక్టర్ కిశోర్‌కుమార్, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి శర్మ, కృష్ణారెడ్డి, ఓబులపతి, రఫీ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన లక్ష్మాపురం సర్పంచ్



సీఎం చంద్రబాబుకు వినతిపత్రాన్ని ఇస్తున్న సర్పంచ్ సుజాత

పగిడ్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపురం సర్పంచ్ సుజాత మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై సీఎంకు వినతి పత్రాన్ని ఇచ్చారు. నందికొట్కూరు నుంచి పగిడ్యాలకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. బేడ బుడగ జంగాలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, లక్ష్మాపురం గ్రామంలో నీటి కొరత ఉందని, నూతన ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. త్వరలోనే తమ సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. సీఎంను కలిసేందుకు చొరవ తీసుకున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు

నందికొట్కూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ నాయకులు రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలిసి జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన మాట్లాడుతూ కళాశాల ఆవరణలో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించాలన్నారు. నూతన ఒకేషనల్ కోర్సులను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దుష్యంత్, ఆంజనేయులు, రవికుమార్, జగన్ పాల్గొన్నారు.

బలవంతపు మత మార్పిడి రాజ్యాంగ విరుద్ధం

- వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి



మాట్లాడుతున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బలవంతపు మత మార్పిడి రాజ్యాంగ విరుద్ధమని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాల విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా డిసెంబరులో అమాయక హిందూసోదరులకు మాయమాటలు చెప్పి మత మార్పిడులకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి చర్యలు దేశ సమైక్యతకు భంగం కలిగిస్తున్నాయన్నారు. జాగరుకులై ఉండి హిందూ సమాజాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రం విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బజరంగ్‌దళ్ కన్వీనర్ పోలేపల్లి సందీప్, జిల్లాకార్యదర్శి కిశోర్‌కుమార్, మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవుళ్ల పాత పటాలను పడేయరాదు



దేవుడి పటాలను విడదీస్తున్న బృంద సభ్యులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేవుళ్ల పాత పటాలను ఎక్కడంటే అక్కడ వేయరాదని మన ఊరి మనగుడి మన బాధ్యత మిత్రబృందం నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం మన ఊరి మనగుడి మన బాధ్యత మిత్రబృందం సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలో ఆయా ప్రదేశాల నుంచి 300 పటాలను సేకరించారు. ఆయా విభాగాలు వేరు చేసి (గ్లాస్, దేవుడి బొమ్మలు,పేపర్, ఫ్రేమ్‌లు) పేపర్‌ను కుందూనదిలోనూ, గ్లాస్‌ను డంప్‌యార్డులో, చెక్క ఫ్రేమ్‌లను కాల్చివేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్‌రెడ్డి, డాక్టర్లు కార్తీక్, గెలివి సహదేవుడు, సభ్యులు రఘు వీర్, వెంకట్, ధరిణిమణి, బాబూరావు, శ్రీదర్, హరికృష్ణ , మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎంపిక



సుధీర్



ఎంఆర్ నాయక్

నంద్యాల ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని నూకా నరసింహయ్య భవన్‌లో నిర్వహించిన జిల్లా మహాసభల్లో కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా సుధీర్, ప్రధాన కార్యదర్శిగా ఎంఆర్ నాయక్, ఉపాధ్యక్షులుగా రాజా, దినేష్, రేణుక, సహాయ కార్యదర్శులుగా హరివర్ధన్, శివకుమార్, హర్ష, మరో 12 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపికచేశారు.

డంపర్‌బిన్లకు చిల్లులు

- రోడ్లపై చెత్తాచెదారం
- అపరిశుభ్రంగా పరిసరాలు
- వెదజల్లుతున్న దుర్వాసన
- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు

నంద్యాల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వీధుల్లో చెత్తాచెదారం సేకరణకు ఏర్పాటు చేసిన డంపర్‌బిన్లకు (చెత్తకుండీలు)పెద్దపెద్ద చిల్లులు పడ్డాయి. చెత్తంతా రోడ్లపైనే పడుతోంది. పందులు, కుక్కలు చిందరవందరగా చేస్తున్నాయి. దాంతో జనాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నంద్యాల పట్టణంలో సుమారుగా 42 వార్డులు ఉండగా, లక్షకు పైగా జనాభా ఉన్నది. ప్రతి రోజు పట్టణానికి వచ్చి పోయ్యే వారు సుమారుగా 20వేలకు పైగా ఉన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, పరిశ్రమలు చాలా ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం పట్టణంలో పలు కాలనీల్లో 85 డంపర్‌బిన్లు ఏర్పాటు చేశారు. చెత్తాచెదారాన్ని డంపర్‌బిన్లలో వేస్తే కంపాక్టు యంత్రవాహనాలు చెత్త వ్యర్థాలను యార్డుకు తరలిస్తాయి. డంపర్‌బిన్లలో అధికశాతం పెద్ద పెద్ద రంధ్రాలు పడగా, కొన్ని శిథిలావస్థకు చేరాయి. ఇళ్లల్లో పోగయ్యే తడి, పోడి చెత్త నిల్వకు పురపాలిక అధికారులు ప్రతి ఇంటికి ప్లాస్టిక్ బుట్టలు సరఫరా చేశారు. కొన్నాళ్లు ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరిగినా తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం పది శాతమే ఇంటింటా చెత్త సేకరణ జరుగుతోంది. దాంతో చాలామంది నేరుగా డంపర్‌బిన్ల సమీపంలోనే చెత్త వేస్తున్నారు. దాంతో చెత్త అంతా రోడ్లమీదే పడుతోంది. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. మురుగు కాల్వల్లోకి చేరుతోంది. దుర్వాసనలు వెదజల్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో చేరే చెత్తతో వర్షాలు పడినప్పుడు నీరు సాఫీగా ప్రవహించక రోడ్డుపైకి, ఇళ్లల్లోకి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో చెత్తపైనే ఎక్కువ చర్చ కొనసాగిస్తున్నా పరిష్కారం చూపడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఎస్‌బీఐ కాలనీలో చిల్లులు పడిన డంపర్‌బిన్లు

టెండర్లను ఆహ్వానించాం

ఇటీవలే టెండర్లను ఆహ్వానించాం. కొత్త వాటిని ఏర్పాటు చేస్తాం. శాంపిల్ డంపర్ బిన్ కూడా తెప్పించాం. వాటి క్వాలిటీ అన్ని టిని చెక్ చేసి టెండర్‌దారుడు రాగానే కొత్తవి చేయించి ఏర్పాటు చేస్తాం.

● మురళి, శానిటైజేషన్ అధికారి నంద్యాల

జీజీహెచ్‌లో చెట్ల నరికివేత

నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీజీహెచ్‌లో చెట్లను నరికివేశారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం ఏకంగా తొమ్మిది చెట్లను నరికివేయడం గమనార్హం. ఆస్పత్రికి వచ్చిన రోగులు, సహాయకులు చెట్లకింద సేదతీరుతుంటారు. చెట్లను నరికివేయడంతో ఆ ప్రాంతంలో రోగులకు నిలువ నీడలేకుండా పోయింది. చెట్ల నరికివేతకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారా? లేదా? అన్నది చర్చనీయాంశమైంది. ఈ సంఘటనపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరిని వివరణ కోరగా చెట్ల ఆకులు భవనంపై ఉన్న నీళ్లట్యాంకులో పడుతుండటంతో పైప్‌లైన్లు బ్లాక్ అయి ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా చెట్లను తొలగించామన్నారు. అయితే చెట్లను కొంతమేరకు తొలగించి ఉంటే ఎలాంటి సమస్య ఉండేదికాదు. కానీ నేలవరకు తొలగించడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కోతకు గురైన చెట్లు

శిఖరం టోల్‌గేట్ వద్ద భక్తుల దౌర్జన్యం

- ఇద్దరు గార్డులను తోసివేసి గేటు దాటిన 17 వాహనాలు
- దోర్నాల వద్ద అడ్డుకున్న అధికారులు
- ఒక్కో వాహనానికి రూ. 2 వేలు జరిమానా

శ్రీశైలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతంలోకి రాత్రి 9గంటలు దాటిన తరువాత అనుమతి ఉండదని చెప్పిన ఇద్దరు గార్డులతో వాగ్వాదానికి దిగి దౌర్జన్యంగా టోల్‌గేటు తెరుచుకుని మధ్యప్రదేశ్, గుజరాత్‌కు చెందిన 17 వాహనాలు దోర్నాల వైపునకు బలవంతంగా దూసుకెళ్లడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. దోర్నాల చెక్‌పోస్టువద్ద భారీగా మోహరించిన అటవీశాఖ సిబ్బంది 17 భారీ వాహనాలను అడ్డుకొని తిరిగి సున్నిపెంట ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. అటవీ జంతువుల సంరక్షణ కోసం విధించిన నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా విధులు నిర్వహిస్తున్న గార్డులను బెదిరించినందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వాహన యజమానులను ఫారెస్ట్‌రేంజర్ పరమేశులు హెచ్చరించి ఒక్కో వాహనానికి రూ. 2000 జరిమానా విధించినట్లు సమాచారం. ఈ విషయంపై వివరాలు తెలియజేసేందుకు అటవీశాఖ అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు చాబోలు విద్యార్థులు

నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14 ఫెన్సింగ్ పోటీలకు చాబోలు జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగశేషు తెలిపారు. పాఠశాలకు చెందిన కడియం సురేంద్ర ఇప్పి విభాగంలో, నూక మహిధర్ సాబరే విభాగంలో, దూదేకుల కబీనా ఫాయిల్ విభాగంలో జిల్లా జట్లకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 9నుంచి 11వరకు నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను పాఠశాల స్థలదాత శివలింగం, విద్యాకమిటీ చైర్మన్ శివలింగం, ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు వినయ్, మణికంఠ ప్రత్యేకంగా అభినందించారు.



కడియం సురేంద్ర



నూక మహిధర్



దూదేకుల కబీనా

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరురూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సింగిల్ విండో చైర్మన్ ఏ.షహబుద్దీన్, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల సంఘం పట్టణ అధ్యక్షుడు జిలాని ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగుల సంక్షేమం కోసం ఏడు వరాలు ప్రకటించారని, ఆ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దివ్యాంగుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నారని, ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ప్రసాదరావు, యూనిట్ ఇన్‌చార్జి మోమిన్ షాకీర్, నాయకులు ఓబులేసు, ఇబ్రహీం ఖలీలుల్లా, షఫీవుల్లా, నాయకులు శ్రీనివాస్, చెన్నయ్య, కలిముల్లా పాల్గొన్నారు.

నల్లమలపల్లెలో వైద్యశిబిరం

కొత్తపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న బలపాలతిప్ప, జానాల గూడెం, సిద్దేశ్వరం గ్రామాల్లో నంద్యాల బాల డెంటల్ క్లీనిక్ మెడికల్ క్యాంపు వైద్యాధికారులు సంతోష్, అనూషల ఆధ్వర్యంలో డెంటల్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆదివారం వైద్యశిబిరంలో 47 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 16 మందికి పళ్లకు సిమెంటు పట్టీలు వేసి వైద్యసేవలు అందించారు. మరో ఎనిమిదిమందికి చెడిపోయిన పళ్లను తొలగించి మందులు అందజేశారు. నంద్యాల నుంచి బాల డెంటల్ క్లీనిక్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించడంతో నల్లమల్లపల్లె గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శిబిరానికి రాంప్రసాద్, సుధాకర్, రమేష్ సహకారం అందించారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ప్రతిభావంతులకు అవార్డులు



జ్ఞాపికలు అందిస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివిధ కళల్లో ప్రతిభ కనబర్చిన వారికి టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను అందజేసినట్లు ఆల్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, లక్ష్మీనరసింహస్వామి ఆల్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు అపర్ణదీపిక, మామడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రథమనందీశ్వర స్వామి కల్యాణమండపంలో అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా నుంచి పలు గ్రామాల నుంచి 1500 మందికి పైగా కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. వాసవీ శక్తి, దుర్గాశక్తి, నాట్యాచార్య, అన్నపూర్ణసేవ, శారదాసేవ, మొదలగు పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ రాయలసీమ జోన్ ధర్మ ప్రచారక్ చౌడూరు ఈశ్వర్‌రెడ్డి, యోగా సెంటర్ నిర్వాహకులు ఆనంద్‌గురూజీ పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు

ఆత్మకూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపనంతాపురం, ముష్టపల్లి గ్రామాల్లో అనధికారికంగా దుకాణాలలో మద్యం అమ్మకాలు చేపడుతున్నారన్న సమాచారం మేరకు ఆదివారం ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సోదాలు నిర్వహించారు. బాపనంతాపురం గ్రామంలో బెల్టు నిర్వాహకులు పాల మహేశ్వరి, బిళ్ల రమణయ్య నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

అయ్యప్ప విళక్కు పూజ



హోమంలో పాల్గొన్న అయ్యప్పస్వాములు, భక్తులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి దేవాలయంలో మండల విళక్కు మహోత్సవం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం అగ్నిప్రతిష్ఠ, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప, నవగ్రహ, శాస్త్రభైరవ హోమాలు, మహా పూర్ణాహుతి, సాయంత్రం ఆయుధపూజ, స్వామివారికి పుష్పయాగం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంగిశెట్టి శ్రీదర్, లయన్ శ్రీకాంత్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రారావు, అయ్యప్ప భక్తులు, గురుస్వామి లక్ష్మయ్య, అర్చకులు భాగవతం గోపీనాథ్‌స్వామి, అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు. హోమాల అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో భవానీ పూజ



కార్యక్రమంలో పాల్గొన్న గురుభవానీ భక్తులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రావతీభావనాఋషి కల్యాణమండపంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో భవాని పూజ నిర్వహించారు. చింతలపల్లె వాసు ఆధ్వర్యంలో గురుభవాని మధు అధ్యక్షతన భవాని భక్తులు మాతకు పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా సూరనసారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, శ్రీశైలం ట్రస్టు బోర్డు మెంబర్లు మేడా మురళీధర్, జిల్లెల్ల శ్రీదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, శ్రీరాములు,సుబ్బారావు హాజరయ్యారు. చింతలపల్లె వాసు మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా భవానీ దీక్ష పూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వక్తలు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ఏవిధంగా ఆచరించాలి, మన సంస్కృతి సాంప్రదాయల గురించి తెలిపారు. ప్రతి ఒక్కరూ దీక్షలను నియమనిష్ఠలతో పాటిస్తూ అమ్మ ఆశీర్వాద బలముతో హిందువులంతా సంఘటితంగా ఉండాలని తెలిపారు.

సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయాలి

నంద్యాల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గణపవరం పీహెచ్‌సీలో పని చేస్తున్న సిబ్బందిని మూకుమ్మడిగా సస్పెండ్ చేస్తున్నట్లు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్జీవోస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి తగిన వసతులు కల్పించకుండా సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉత్తర్వులు రద్దు చేసేంత వరకు పోరాడతామని హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, కార్యదర్శి నర్సారెడ్డి, మణి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు రుణాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలని చేతివృత్తి దారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని శాంతిభవన్‌లో చేతివృత్తి దారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేతివృత్తిదారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఆదరణ పథకం కింద సబ్సిడీ రుణాలు ఇస్తామని ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారన్నారు. నేటికి రుణాలు మంజూరు చేయకపోవడం చేతివృత్తిదారులను మోసగించడమేనన్నారు. ప్రభుత్వం వెంటనే రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, బాలనరసింహులు, చేతి వృత్తిదారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మిట్టకందాలలో కార్డన్ సెర్చ్



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేశ్

పాములపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టకందాల గ్రామంలో ఆదివారం ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. నేరచరిత కలిగిన వారి ఇళ్లల్లో, కల్లాల్లో సోదాలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని తొమ్మిది మోటారు సైకిళ్లను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు రమణ, శివ, పవన్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

వెలుగోడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఆత్మకూరు రూరల్ సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన నాగమణి వెలుగోడులోని ఎస్‌బీఐలో లోన్ నిమిత్తం వెళ్లింది. ఆమె బ్యాగు నుంచి దుండగులు ఓ బంగారు ఆభరణాన్ని తస్కరించారు. గుర్తించిన ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆదివారం వెలుగోడు ఎస్ఎస్ఆర్ఎస్ డిగ్రీ కాలేజి ప్రాంతంలో నిందితులు అన్నారెడ్డి లక్ష్మి, మోట రిబ్క, మోట ప్రతాప్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. నాగమణికి చెందిన రూ2,25,000ల విలువ గల బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నేరాలకు ఉపయోగించిన ఆటోను సైతం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణం

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి

చాగలమర్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఎస్పీజీ చర్చి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఆదివారం ఆయన ప్రారం భించి మాట్లాడారు. క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 8 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకుడు డేవిడ్ తెలిపారు. మొదటి స్థానంలో గెలిచిన జట్టుకు రూ.30 వేలు, రెండో స్థానం రూ.15 వేలు నగదును అందజేస్తామన్నారు. సెటిల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీసరీ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పీఈటీలు నందు, నరసింహుడు, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

శిరివెళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని యర్రగుంట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం స్మిత మాధురి అన్నారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం 3.0 కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి రూ.10,116, కేసీ కెనాల్ డబ్ల్యూ యూఏ-29 అధ్యక్షులు కమతం లక్ష్మీరెడ్డి రూ.5వేలు, టీడీపీ యువ నాయకుడు సత్తారు లక్ష్మీరెడ్డి రూ.10వేలు, ఓ విద్యార్థి తండ్రి ఎమ్ అబ్దుల్ రసూల్ రూ.5వేలు పాఠశాల అభివృద్ధికి వితరణగా అందజేశారన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు దాతలు అందించిన ప్రోత్సాహాన్ని వినియోగిస్తామని హెచ్‌ఎం స్మిత మాధురి వెల్లడించారు.

ఆరుతడి పంటలను సాగు చేసుకోండి

అవుకు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు రబీలో ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని ఎస్సార్బీసీ ఈఈ శుభకుమార్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రిజర్వాయర్‌లో 4 టీఎంసీల నీటిని నిల్వ చేయడంతో రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు రివిట్‌మెంట్ అక్టోబరు నెల 3వ తేదీన కొంతమేర కుంగిందన్నారు. రిజర్వాయర్ భద్రతను దృష్టిలో ఉంచుకొని చెర్లోపల్లె సమీపంలోని జీఎన్‌ఎస్‌ఎస్ హెడ్‌రెగ్యులేటర్ నుంచి దాదాపు 2 టీఎంసీల నీటిని కడప జిల్లాకు తరలించామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 2 టీఎంసీలు నీరు మాత్రమే ఉందన్నారు. కుంగిన రివిట్ మెంట్ మరమ్మతు పనుల కోసం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రూ. 57 లక్షలు మంజూరు చేయించారు. రివిట్‌మెంట్ మరమ్మతు పనులను రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. అలాగే గోరుకల్లు రిజర్వా యర్‌లో 7 టీఎంసీలు నీరు మాత్రమే నిల్వ ఉందన్నారు. కాబట్టి రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.

రబీ సాగుకు సన్నద్ధం



శిరివెళ్లలో పొలాన్ని నారుమడికి సిద్ధం చేస్తున్న రైతు

శిరివెళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ ముగియడంతో.. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న అన్నదాతలు రబీలో పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కేసీ కెనాల్ ప్రధాన నీటి వనరుగా ఉన్న ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని మండలాల్లో వేల ఎక రాల్లో రబీలో వరిపైరు సాగు చేసేందుకు రైతులు సమాయత్తమ వుతున్నారు. కొందరు రైతులు బోర్లు, బావుల కింద వరిపంట సాగు చేసేందుకు ఇప్పటికే నారుమడిని సిద్ధం చేయగా.. మరికొంత మంది రైతులు కేసీ కెనాల్ పరిధిలో నారుమడుల ఏర్పాటుకు ట్రాక్టర్లతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

గ్రామాభివృద్ధి కోసం తీర్మానాలు

డోన్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజోతి): గ్రామాభివృద్ధి కోసం పాలకవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్లు వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వెంకటనాయునిపల్లె గ్రామంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు, గ్రామంలో ఊరబావి వద్ద, చిన్నమాదన్న ఇంటి వద్ద, పెద్దమ్మ గుడి వద్ద, సచివాలయం వద్ద గ్రౌండ్‌వెల్ మంచినీటి ట్యాంకుల ఏర్పాటుకు తీర్మానాలైనట్లు తెలిపారు. అలాగే బీసీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీ వరకు సీసీ రోడ్ల ఏర్పాటుకు పాలకవర్గ సభ్యుల సమావేశంలో తీర్మానాలు ఆమోదం పొందినట్లు సర్పంచ్ వెల్లడించారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు

డోన్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజోతి): డోన్ మండలం అభిరెడ్డిపల్లె చెరువు సమీపంలో మృతి చెందిన అనాథ యాచకుని శవానికి హిందూ సాంప్రదాయ పద్ధతిలో ఆదివారం ద్రోణాచలం సేవా సమితి సభ్యులు హిందూ సాంప్రదాయ పద్ధతిలో డోన్ హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అలాగే డోన్ పట్టణ రైల్వే ప్లాట్‌ఫారం వద్ద మృతి చెందిన అనాథ యాచకుని మృతదేహాన్ని కూడా హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణ సీఐ ఇంతి యాజ్ బాషా, జీఆర్పీ పోలీసుల ఆదేశాల మేరకు ఈ అనాథ శవాలకు ద్రోణాచలం సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ద్రోణాచలం సేవా సమితి అధ్యక్షుడు షాదీఖానా రాజా, గురుస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అవుకు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామక్రిష్ణవేణి ఆదివారం తెలిపారు. మండల అధ్యక్షుడు చల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరు కావాలని కోరారు.

లింగమయ్య స్వామికి పూజలు

రుద్రవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తలూరు సమీపంలో కొలువుదీరిన లింగమయ్య స్వామికి ఆదివారం అర్చకులు అభిషేకం, తదితర పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ఠ

- తాగునీటి ఇక్కట్లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

బనగానపల్లె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె రైల్వేస్టేషన్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవు. తాగునీటి కొళాయిలు ఉన్నా నీటిని విడుదల చేయడం లేదు. మరుగుదొడ్లు ఉన్నా నీటి సౌకర్యం లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అలాగే టీ తాగడానికి హోటళ్లు కూడా లేవు. ఆహార పదార్థాలు గాని, మంచినీటి బాటిళ్లు గాని రైల్వే స్టేషన్‌లో దొరకడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బనగానపల్లె మీదుగా మూడు రైళ్లు మాత్రమే బనగానపల్లె మీదుగా నడుస్తున్నాయి. ధర్మవరం నుంచి మచిలీపట్నం వరకు బనగానపల్లె మీదుగా ఒక రైలు, అలాగే గుంటూరు నుంచి నంద్యాల, బనగానపల్లె మీదుగా తిరు పతి వరకు ఒక రైలు, నంద్యాల నుంచి బనగానపల్లె , ఎర్రగుంట్ల, కడప మీదుగా రేణిగుంట వరకు ఒక డెమో రైలు నడుస్తోంది. అయితే ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా రైల్వేస్టేషన్‌లో సమస్యలు తీరడం లేదు.

బనగానపల్లె రైల్వేస్టేషన్ ప్రారంభం

కేంద్ర హోంశాఖ మాజీ సహాయ మంత్రి, బిహార్ గవర్నర్‌గా పని చేసిన దివంగత పెండేకంటి వెంకసు బ్బయ్య కృషితో బనగానపల్లె - యర్రగుంట్ల రైల్వేలైన్ పూర్తి అయింది. ఆయన హయాంలోనే భూసేకరణ, రైల్వే లైన్‌లు ప్రారంభమయ్యాయి. నంద్యాల-యర్రగుంట్ల రైల్వేలైన్ 2016 ఆగస్టులో కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్‌కుమార్, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు, అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు,



రైల్వేస్టేషన్‌లో నిరుపయోగంగా కొళాయిలు



బనగానపల్లె రైల్వేస్టేషన్

ప్రస్తుత రోడ్లు భవనాల శాఖ మంత్రి, అప్పటి బనగానపల్లె ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు రిమోట్ ద్వారా విజయవాడ నుంచి నంద్యాల- యర్రగుంట్ల వరకు రైల్వేలైన్‌ను ప్రారంభించి డెమో రైలును ప్రారంభించారు. అప్పటినుంచి రైల్వే స్టేషన్‌లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి.

రైళ్ల సంఖ్యను పెంచాలి

నంద్యాల - యర్రగుంట్ల లైన్ ప్రారంభించినప్పుడు డెమో రైలును నంద్యాల నుంచి కడప జిల్లా యర్రగుంట్ల వరకు నడిపేవారు. ప్రస్తుతం మచిలీపట్నం నుంచి ధర్మవరానికి, గుంటూరు నుంచి తిరుపతి, మదనపల్లె, కదిరి మీదుగా ధర్మవరం వరకు, నంద్యాల నుంచి రేణిగుంట వరకు మాత్రమే నడుపుతున్నారు. రైల్వే సంఖ్యను పెంచాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. చెన్నైకి, బెంగళూరు వరకు రైళ్లను నడపాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు. బస్సు ప్రయాణం కంటే రైలు ప్రయాణం అందరికీ సౌకర్యంగా ఉండడమేగాక చార్జీలు కూడా తక్కువగా ఉండడంతో ఈ మార్గం ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.

ప్రయాణికులకు నీటి వసతి కల్పించాలి



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు నీటి వసతి కల్పించాలి. ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచాలి. మరుగు దొడ్లు ఉన్నా నీటి వసతి లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- తులసిరెడ్డి, సర్పంచ్, మిట్టపల్లె

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ షిటోరియా చాంపియన్‌షిప్ 2025 పోటీలకు బీసీ రాజారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ కరాటేను ఒకప్పుడు ఆత్మరక్షణగా నేర్చుకునే వా రని, నేడు ఒక క్రీడగా గుర్తించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కరాటేతో మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటారన్నారు. పిల్లలను సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కరాటేతో క్రమశిక్షణతో పాటు శారీరక ధృడత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ ఏపీ ప్రెసిడెంట్ ప్రతాప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్, జనరల్ సెక్రటరీ సూర్యవంశీ, ఒలింపిక్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నెహ్రూ స్కూల్ డైరెక్టర్ కోడూరు రవితేజారెడ్డి, టీడీపీ నాయకులు అల్తాఫ్ హుసేన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అహోబిలం దేవస్థాన ఏవోగా రామానుజన్



బాధ్యతలు స్వీకరిస్తున్న రామానుజన్

ఆళ్లగడ్డ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో)గా వీఎల్ఎన్ రామానుజన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మఠం పీఠాధిపతి రంగనాథ మహదేశికన్ ఆదేశాల మేరకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించారన్నారు. అహోబిల క్షేత్రం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

చాగలమర్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల అభివృద్ధికి దాతలు రూ.లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. భీమలింగాయపల్లెకు చెందిన దాతలు కృష్ణయ్య, రామాంజనేయులు రూ.50 వేలు, ప్రొద్దు టూరుకు చెందిన చిన్న హనుమంతు రూ.10వేలు, మైదుకూరుకు చెందిన సంజీవరాయుడు రూ.20 వేలు, పెద్దబోదనానికి చెందిన పెద్ద సంజీవరెడ్డి రూ.20 వేలు నగదును అందజేశారు. దాతలను కమిటీ సభ్యులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆల య కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న హాస్టల్ వార్డెన్ మధు

డోన్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజోతి): స్థానిక బీసీ బాలుర సంక్షేమ హాస్టళ్లకు వచ్చిన దుప్పట్లను ఆదివారం ఉదయం విద్యార్థులకు వార్డెన్ ఎన్.మధు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన దుప్పట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే ఆలయాల అభివృద్ధి

ఆళ్లగడ్డ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని పార్టీ మండల కన్వీనర్ హరికుమార్‌రెడ్డి, నాయకుడు గుర్రప్ప యాదవ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. నల్లగట్ల చెన్నకేశవ స్వామి ఆలయం నిర్మాణానికి టీడీపీ నాయకులకు కమీషన్ ఇవ్వాలని వైసీపీ నాయకులు ఓ పత్రికలో ప్రచురించడం సబబు కాదన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంత్రిగా ఉన్నప్పుడే చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి అనుమతి ఇచ్చారని, ప్రభుత్వం మారడంతో పనులు నిలిపి వేశారని అన్నారు. వైసీపీ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి ఐదేళ్లుగా దేవుడి మాన్యం వేలం పాట వేయకుండా అడ్డుకున్నారని అన్నారు. ఆలయ నిర్మాణం కోసం సాయం చేయాలని, తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

మూలపెద్దమ్మకు పూజలు

దొర్నిపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి గాజులు, పండ్లు, పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. తరలివచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, కంపమల్ల పెద్దన్న తీర్థప్రసాదాలు అందజేశారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వైవీ రమణయ్య



వైవీ రమణయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బోడెమ్మనూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైవీ రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కౌన్సిలర్ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం నంద్యాల పట్టణంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జిల్లా ఉపాధ్యాయులంతా కలిసి రమణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రమణయ్యను సన్మానించారు.

నేరాలకు పాల్పడితే చర్యలు: సీఐ





కొలిమిగుండ్ల, బేతంచెర్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐ

కొలిమిగుండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు సీఐ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు: కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో వాహనదారులకు ఆదివారం రాత్రి డ్రం కెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

గొర్విమానుపల్లె గ్రామాన్ని సందర్శించిన సీఐ: మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన గొర్విమానుపల్లెను సీఐ రమేష్‌బాబు ఆదివారం రాత్రి సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. నాపరాతి గనుల్లో కేబుల్ చోరీ ఘటనపై విచారణ చేపట్టారు. దొంగతనాలు, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

బేతంచెర్ల: గ్రామాల్లో రౌడీ షీటర్లు అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్ బాబు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీ షీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఘర్షణలకు దిగి, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

బెలుం గుహల్లో సందర్శకుల తాకిడి



గుహల అందాలను తిలకిస్తున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్యాటక కేంద్రం బెలుం గుహల్లో సందర్శకుల తాకిడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు పెద్ద ఎత్తున బెలుం గుహలకు తరలివచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు బస్సుల్లో అధిక సంఖ్యలో తరలివచ్చి బెలుం గుహల అందాలను తిలకించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికంగా ఉన్నారు. దీంతో బెలుం గుహలకు ఒక్క రోజు ఆదాయం అధికంగా రూ.70 వేలు వచ్చినట్లు గుహల సిబ్బంది వెల్లడిం చారు. గుహల్లోని పాతాళ గంగ, వెయ్యిపడగలు, ఊడలమర్రి, సన్యాసి మఠం, కోటి లింగాలు తదితర ప్రాంతాలను సందర్శించారు.

అహోబిలంలో విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

ఆళ్లగడ్డ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని బీజేపీ ఫ్లోర్ లీడర్, విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆదివారం దర్శించుకున్నారు. అహోబిలం దేవస్థానానికి రాగానే ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆనంతరం ఆయన శెట్టి విజయ్ కుమార్‌తో కలిసి లక్ష్మీనరసింహ స్వామిని శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

బీసీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారా యణగౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి పేదల్లో భరోసా నింపిందని అన్నారు. బీసీలకు కార్పొరేషన్ ద్వారా రుణాలు, ఆదరణ పనిముట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, పుల్లయ్య, సిద్ధప్ప, లాలయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

చాగలమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అహోబిలం క్షేత్రంలో నిర్వహించిన 69వ బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన నిరంజన్, వెంకట సుశాంత్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పీడీ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఇటీవల పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో జాతీయస్థాయికి ఎంపి కైన విద్యార్థులను కలెక్టర్ రాజకుమారి అభినందించారు. అలాగే హెచ్‌ఎం జీవయ్య, క్రీడా సంఘం జిల్లా కార్యదర్శి ఆశాజ్యోతి, సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణశాస్త్రి, మహబూబ్‌బాషా, నారాయణమూర్తిలు అభినందించారు.

అనాథలను ఆదుకోవడం అభినందనీయం



స్వెటర్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు రోటరీ క్లబ్ వారు చలికాలంలో స్వెటర్లు పంపిణీ చేసి ఆదుకోవడం అభినందనీయమని డీఎస్పీ ప్రమోద్ అన్నారు. ఆదివారం స్థానిక చింతకుంట రోడ్డులోని బాలసదన్ లోని అనాథ పిల్లలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్వెటర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ ప్రమోద్ హాజరై 45 మంది పిల్లలకు రూ.20వేల విలువ చేసే స్వెట్టర్లు అందజేశారు. అనంతరం డీఎస్పీని రోటరీ క్లబ్ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బైసాని రవిప్రకాష్, ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి ఉషామహేశ్వరి, టిఎంసీ వేణుగోపాల్, హెచ్‌ఎం మాధవి పాల్గొన్నారు.

భగవద్గీతతో మానసిక ప్రశాంతత

కొలిమిగుండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భగద్గీతతో మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని త్రైతసిద్ధాంతం, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుడు పోరెడ్డి రామకృష్ణారెడ్డి, పీఎంహెచ్ నాయుడు, సురేష్ అన్నారు. ఆదివారం త్రైతసిద్ధాంతం, ఇందూ జ్ఞాన వేదిక కొలిమిగుండ్ల, కోవెల కుంట్ల, పేరుసోముల, తాడిపత్రి, బందార్లపల్లెలో కమిటీ సభ్యులు ఇం టింటా భగవద్గీత ప్రచారం నిర్వహించారు. మండలంలోని నాగిశె ట్టిపల్లె, ఎర్రగుడి, హనుమంతుగుండం, బి.ఉప్పలూరు, నాగిశెట్టిపల్లె తదితర గ్రామాల్లో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేసి, గీతపై అవగాహన కల్పించారు.

మహ్మద్ హుసేన్‌కు అవార్డు

ఆళ్లగడ్డ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సపురం గ్రామానికి చెందిన ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం అధ్యక్షుడు మహ్మద్ హుసేన్‌కు ఆదివారం అవార్డు లభించింది. కడపకు చెందిన ఖాన్ కా రిస్తా చారిటబుల్ ట్రస్ట్ పదో వార్షికోత్సవం సందర్భంగా రక్త దాతలను గౌరవించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డకు చెందిన బ్లడ్ డోనర్స్ టీం అధ్యక్షుడు మహ్మద్ హుసేన్ సేవలను గుర్తించిన ట్రస్ట్ నిర్వాహకులు ఆయనకు శాలువ కప్పి జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

చలి..పులి



రుద్రవరంలో చలిమంట కాచుకుంటున్న ప్రజలు

రుద్రవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లమల తీరంలో చలి పంజా విసురుతుంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి చలి విపరీ తంగా ఉందని స్థానిక ప్రజలు వాపోయారు. చలి నుంచి రక్షణ పొందేందుకు చలి మంట వేడిని కాచుకుంటున్నారు. అడవి తీరం గ్రామాల్లో అధికంగా చలి ఉంటుందని ప్రజలు తెలిపారు.